V కామెంట్

# గందరగోళంలో ఓట్లు.. ప్రజా విశ్వాసానికి తూట్లు

భారత ప్రజాస్వామ్యంలో పార్లమెంట్ అత్యున్నత న్యాయస్థానానికి సమానమైన రాజకీయ వేదిక. ప్రజల తరఫున ఎన్నికైన ప్రతినిధులు అక్కడ దేశ ప్రయోజనాలపై చర్చించాలి. సమస్యలకు పరిష్కారాలు అందించాలి. కానీ గత మూడు రోజులుగా జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలు చూస్తుంటే, ప్రజా ధనాన్ని,విలువైన సమయాన్ని హరిస్తున్న దృశ్యం మళ్లీ ప్రత్యక్షమవుతోంది. వాస్తవానికి ఈసారి ప్రతిపక్షం లేవనెత్తిన విషయం ఆషా మాషీ అంశం కాదు. బీహార్ రాష్ట్రంలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో దాదాపు 56 లక్షల ఓట్లు గల్లంతు అయ్యాయని తీవ్ర ఆరోపణలతో ప్రతిపక్షం నిలదీస్తోంది. ఈ విషయంలో స్పష్టత ఇవ్వాలని, పార్లమెంట్ చర్చించాల్సిందిగా డిమాండ్ చేస్తోంది. కానీ, పాలక బీజేపీ పార్టీ మాత్రం దీనిపై చర్చించేందుకు సిద్ధంగా లేదు. దీనివల్ల గత మూడు రోజులుగా సభా వ్యవహారాలు అస్తవ్యస్తంగా కొనసాగుతున్నాయి. ప్రతిపక్ష పార్టీలు – ముఖ్యంగా కాంగ్రెస్, ఆర్జేడీ, తృణమూల్ కాంగ్రెస్, సీపీఐలు, మరియు డీఎంకే ఈ పోకడను ప్రజాస్వామ్యానికి ఒక ప్రమాదకర సంకేతంగా భావిస్తున్నాయి. ఎన్నికల్లో ఓట్లు ఓటర్ల హక్కుల ప్రతిరూపం.. దీనిపై నీలి నీడలు పడటం అంటే ఇది అత్యంత ఆందోళనకరమైన అంశం. ఈ గందరగోళం పై చర్చ జరగాలి అంటే, దీన్ని ప్రభుత్వం నిర్లక్ష్యంగా భావించం సహేతుకం కాదు. ఇప్పటికే ఎన్నికల సంఘం వివరణ ఇచ్చినా, అది చాలదని ప్రతిపక్షం అభిప్రాయపడుతోంది. పార్లమెంట్లో ఈ అంశంపై పూర్తి స్థాయిలో చర్చ జరగాలని, కేంద్ర ఎన్నికల సంఘం వేదికపైకి రావాలని కోరుతోంది. ఇదే సమయంలో ప్రభుత్వ స్పందన అసంతృప్తికరంగా ఉండటమే కాకుండా, సభా కార్యకలాపాలు సజావుగా జరిగేందుకు కూడా ప్రభుత్వం అడ్డంకిగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటువంటి సందర్భాల్లో స్పష్టత, పారదర్శకతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలి. కానీ కేంద్రం వైఖరి విపక్షాల అనుమానం నిజమేనేమో అనిపిస్తోంది, సున్నితమైన ఇలాంటి విషయాలపై చర్చకు భయపడే ప్రభుత్వ వైఖరి ప్రజాస్వామ్యానికి ఎదురుదెబ్బలాంటిదే. ఈ తరహా పరిస్థితులు ఇలాగే కొనసాగితే, సాధారణ ప్రజలకు ఈ వ్యవస్థలో తగిన న్యాయం జరగదన్న అనుమానం మరింతగా బలపడుతుంది. పార్లమెంటును సహేతుక సమస్యలపై చర్చించేందుకు అనుమతించాలి కాని అడ్డగోలుగా విపక్షాల గొంతు నొక్కివేయకూడదు .

**భారత పార్లమెంట్ సమావేశాలకు సగటున:**

- ఒక్క నిమిషానికి ₹ 2.5 లక్షల నుంచి ₹ 2.7 లక్షల వరకు ఖర్చవుతోంది.
- ఈ ఖర్చుల్లో ఎంపీలు, ఉద్యోగులు, భద్రతా బలగాల వేతనాలు, విద్యుత్, ఆధారాలు ముద్రించడం, మీడియా సేవలు మొదలైనవి ఉంటాయి.

అంటే, సభ స్తంభిస్తే లేదా వాయిదా వేస్తే, ప్రతి నిమిషం లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతుంది. అందుకే అధికార విపక్షాలు భాద్యతగా వ్యవహరించాలి. ఓట్ల పై విపక్షాల డిమాండ్ గౌరవించి చ్రచకు అనుమతించాలి. బీహార్ ఓటర్ల జాబితాలో పేరు ఉన్నా, పోలైన ఓట్ల సంఖ్య తక్కువగా ఉండటం గమనించారు .అందుకే పార్లమెంట్ లో చర్చ జరగాలనే డిమాండ్ అర్థవంతమైంది.

ఎన్నికల సంఘం, బూత్ స్థాయిలో పోలింగ్ శాతం వెంటనే ప్రకటించడంలో విఫలమవుతోంది. ఫలితాల ప్రకటనలో ఆలస్యం వల్ల ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయి. కొన్ని చోట్ల ఈవీఎంలను పార్టీ ప్రతినిధుల సమక్షంలో కాకుండా తరలించడం జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.కొన్ని చోట్ల ఎన్నికల సంఘం ప్రతినిధులు కొన్ని పార్టీలకు ప్రధానంగా బీజేపీ దాని అనుబంధ పార్టీలకు అనుకూలంగా పనిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి . సోషల్ మీడియా, స్వతంత్ర పర్యవేక్షకులు చూపే ఆధారాలు ఈ అనుమానాలను మరింత బలపరుస్తున్నాయి . ప్రజాస్వామ్యం బలపడాలంటే ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉండాలి. అందుకు కొన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది:ప్రజలు నమ్మకంతో పోలింగ్ ప్రక్రియను అనుసరించేందుకు ఇది కీలకం. ఎన్నికల్లో తప్పులు జరిగినట్లు రుజువైతే సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఎన్నికల అనంతరం ఈవీఎంల పనితీరుపై స్వతంత్ర సంస్థల ద్వారా ఆడిట్ జరగాలి. భారత ప్రజాస్వామ్యం మీద విశ్వాసం కొనసాగాలంటే, ఎన్నికల విధానం పట్ల ప్రజల్లో ప్రగాఢమైన నమ్మకం ఉండాలి. పార్లమెంటు సమావేశాలు లక్షల రూపాయల ప్రజాధనం ఖర్చుపెట్టి, ప్రజలకు సమాధానం చెప్పలేకపోతే అది ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమే అవుతుంది. ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించడానికే కాదు, ప్రజా హక్కుల పరిరక్షణ కోసమే పోరాడుతున్నాయని పాలకులు గుర్తించాలి. లేదంటే, ఎన్నికలప్రక్రియ పై అనుమానాలు మరింత తీవ్రంగా మారే అవకాశం ఉంది.

> “ బీహార్ రాష్ట్రంలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో దాదాపు 56 లక్షల ఓట్లు గల్లంతు అయ్యాయని తీవ్ర ఆరోపణలతో ప్రతిపక్షం నిలదీస్తోంది. ఈ విషయంలో స్పష్టత ఇవ్వాలని, పార్లమెంట్ చర్చించాల్సిందిగా డిమాండ్ చేస్తోంది. కానీ, పాలక బీజేపీ పార్టీ మాత్రం దీనిపై చర్చించేందుకు సిద్ధంగా లేదు. దీనివల్ల గత మూడు రోజులుగా సభ వ్యవహారాలు అస్తవ్యస్తంగా కొనసాగుతున్నాయి.



> “ ఓట్ల పై విపక్షాల డిమాండ్ గౌరవించిచర్చకు అనుమతించాలి. బీహార్ ఓటర్ల జాబితాలో పేరు ఉన్నా, పోలైన ఓట్ల సంఖ్య తక్కువగా ఉండటం గమనించారు .అందుకే పార్లమెంట్ లో చర్చ జరగాలనే డిమాండ్ అర్థవంతమైంది.

> “ సోషల్ మీడియా, స్వతంత్ర పర్యవేక్షకులు చూపే ఆధారాలు ఈ అనుమానాలను మరింత బలపరుస్తున్నాయి . ప్రజాస్వామ్యం బలపడాలంటే ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉండాలి. అందుకు కొన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది



- డాక్టర్. పి. విజయబాబు
సీనియర్ సంపాదకులు

> “ ఎన్నికల సంఘం, బూత్ స్థాయిలో పోలింగ్ శాతం వెంటనే ప్రకటించడంలో విఫలమవుతోంది. ఫలితాల ప్రకటనలో ఆలస్యం వల్ల ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయి. కొన్ని చోట్ల ఈవీఎంలను పార్టీ ప్రతినిధుల సమక్షంలో కాకుండా తరలించడం జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.కొన్ని చోట్ల ఎన్నికల సంఘం ప్రతినిధులు కొన్ని పార్టీలకు ప్రధానంగా బీజేపీ దాని అనుబంధ పార్టీలకు అనుకూలంగా పనిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి .

# థాయ్ కంబోడియా మధ్య యుద్ధమేఘాలు

థాయ్‌ల్యాండ్‌కంబోడియాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. సరిహద్దు వివాదంతోనే థాయ్ ప్రధాని ఏకంగా పదవిని కోల్పోయారు. ఇరు దేశాల మధ్య 508 మైళ్ల సరిహద్దు ఉంది. దీనిలో అత్యధిక భాగాన్ని ఫ్రాన్స్ పాలన కింద ఉన్నప్పుడే గుర్తించారు. రెండు దేశాలు శాంతియుతంగా కలిసి ఉన్నా.. సరిహద్దులు మాత్రం తరచూ భగ్గుమంటున్నాయి. ప్రముఖ ఆలయాలు ఉన్న ప్రీహ్ విహార్, ట మోన్ థోమ్, ట మ్యూన్ థోమ్ ఉన్న పర్వతాలు, అరణ్యాలు కలగలిసిన ప్రాంతాల కోసం రెండుదేశాల నడుమ పోరాటం జరుగుతోంది. వీటిల్లో 9వ శతాబ్ధానికి చెందిన ప్రీహ్ విహార్ కీలకమైంది. దీనిని ఖెమర్ పాలకులు నిర్మించారు. డాంగ్రెక్ పర్వతాల శిఖరం థాయ్‌ల్యాండ్‌కు అత్యంత సమీపంలో ఉంటుంది. ఈ ఆలయం కంబోడియాకు చెందుతుందని 1962లో అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. దానిని థాయ్‌ల్యాండ్ అంగీకరించింది. కానీ, ఆ దేవాలయం కేంద్రంగా స్థానిక సెంటిమెంట్లు తరచూ వివాదాలకు కారణమవుతున్నాయి. కంబోడియా విజ్ఞప్తి మేరకు 2008లో ఈ ఆలయాన్ని యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది. దీనిని థాయ్‌ల్యాండ్ తీవ్రంగా వ్యతిరేకించింది. కంబోడియా నాడు చూపిన మ్యాప్‌లో 4.6 చదరపు మైళ్లను ఆక్రమించుకొన్నట్లు ఆరోపించింది. వాస్తవానికి ఇక్కడ సరిహద్దుల నిర్ధరణ జరగలేదు. ఇది 200811 మధ్య పలు సార్లు ఘర్షణలకు దారి తీసింది. 2011లో దాదాపు డజను మంది ప్రాణాలు కోల్పోయారు. సరిహద్దుల్లోని వేల మంది ఇళ్లను వదిలి పారిపోయారు. కొన్నేళ్ల ముందు ఐసీజే మరో తీర్పు ఇచ్చి అగ్గి రాజేసింది. ప్రీహ్ విహార్ పరిసరాల్లో కంబోడియా సార్వభౌమత్వం ఉందని.. థాయ్ దళాలు వైదొలగాలని కోరింది. దీనికి బ్యాంకాక్ అంగీకరించినా.. మ్యాప్‌లు, మిలిటరీ గస్తీలపై వివాదం మొదలైంది. ఇక తమ దేశ పరిధిలోని సురిన్ ప్రావిన్స్‌లోని ట మోన్ థోమ్, ట మ్యూన్ థోమ్ ప్రాంతాలు కూడ ఇరు దేశాల వివాదాస్పద ప్రదేశాలుగా మారిపోయాయి. ఈ ఏడాది మే నెలలో జరిగిన ఘర్షణలో ఓ కంబోడియా సైనికుడు మృతి చెందాడు. పినోమ్ పెన్‌లో ఇది జాతీయవాద సెంటిమెంట్‌ను ఎగదోసింది. అధికారం చేపట్టిన పది నెలలకే థాయ్‌లాండ్ యువ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రాకు పదవీగండం ఈ వివాదం నుంచే వచ్చింది. కంబోడియా మాజీ ప్రధాని హున్‌సేన్‌తో ఫోన్‌కాల్‌లో మాట్లాడింది. అంకుల్ అంటూ ఆయనను సంబోధించిన ఆమె.. తన దేశంలోని పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా థాయ్ ఆర్మీ కమాండర్ తనకు వ్యతిరేకంగా ఉన్నాడని పేర్కొన్నారు. అయితే, వీరిద్దరి మధ్య జరిగిన ఈ ఫోన్‌కాల్ సంభాషణ లీకైంది. దీంతో సొంత పక్షం నుంచే ఎదురుదెబ్బ తగిలింది. ప్రధాని ఫోన్‌తో తమ దేశ పరువు, ఆర్మీ గౌరవం దెబ్బతిన్నాయని ఆరోపిస్తూ షినవత్రా సంకీర్ణ ప్రభుత్వం నుంచి కన్జర్వేటివ్ భూమ్‌జాయ్‌థాయ్ పార్టీ విడిపోయింది. షినవత్రా పదవిని కోల్పోయారు. ఇక్కడ కంబోడియా వ్యతిరేక సెంటిమెంట్ ఎంత బలంగా ఉందో ఈ ఘటన చెబుతోంది.



**రంగంలోకి థాయ్ వాయుసేన యుద్ధవిమానాలు**

ఇటీవల కాలంలో ఇరుదేశాల మధ్య మందుపాతరల అంశం కీలకంగా మారింది. వివాదాస్పద ప్రదేశాల్లో ల్యాండ్‌మైన్లు పేలడంతో థాయ్‌ల్యాండ్ సైనికులు గాయపడ్డారు. థాయ్ ఇది తమ ప్రదేశంలో జరిగిందని చెబుతుండగా..కంబోడియా మాత్రం ప్రీహ్ విహార్ ఆలయ పరిసరాల్లో చోటు చేసుకొందని వాదిస్తోంది. వారం క్రితం కూడా వివాదాస్పద స్థలాల్లో ఇలాంటి ఘటనలే చోటు చేసుకొన్నాయి. పినోమ్ పెన్ సేనలు రష్యా నుంచి కొనుగోలు చేసిన మైన్లను ఇటీవలే ఇక్కడి భూమిలో పాతినట్లు బ్యాంకాక్ ఆరోపిస్తోంది. ఈ ఆరోపణలను కంబోడియా ఖండించింది. థాయ్ సేనలే ఒప్పందంలోని గస్తీ మార్గాలను ఉల్లంఘిస్తున్నాయని చెబుతోంది. తాజాగా సరిహద్దు వివాదం ముదరడంతో థాయ్ వాయుసేనకు చెందిన ఎఫ్16 యుద్ధ విమానాలు రంగంలోకి దిగి ట మోన్ థోమ్ ఆలయ ప్రదేశంలో బాంబింగ్‌చేశాయి. ఇక క్షేత్ర స్థాయిలో కంబోడియా సేనలు శతఘ్నులతో దాడులు చేస్తున్నాయి. దాదాపు 40,000 మంది ప్రజలు ఈ సైనిక ఘర్షణల ప్రాంతంలో ఉన్నారు. దీంతో రెండుదేశాల ఘర్షణలో ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు.

- మహా, నెట్ వర్క్



# గౌడ్‌జి ఆఫ్ బీసీ.. యాఓసి..

## చమత్కరించిన ఖర్గే

### తెలంగాణ నేతలతో సరదా సంభాషణ

**ఢిల్లీ, మహా :** తెలంగాణ కాంగ్రెస్ నేతలతో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ఉల్లాసంగా మాట్లాడారు. తెలంగాణ నేతలతో సరదాగా జోక్స్ వేసి ఖర్గే నవ్వులు పూయించారు. గౌడ్ జి ఆఫ్ బీసీ ..యా ఓసి.. అని ఖర్గే చమత్కరించారు. మహేష్ భాయ్ బై బర్త్ బీసీ బట్ పొలిటికల్లి ఓసి అంటూ సీఎం రేవంత్ రెడ్డి సరదాగా అన్నారు. దీంతో అందరూ నవ్వారు. ఖర్గే నివాసంలో 2 గంటలపాటు బీసీ కులగణన, 42 శాతం రిజర్వేషన్లు అంశంపై చర్చ జరిగింది. ఏఐసీసీ అగ్రనేత, లోక్ సభ ప్రధాన పక్ష నేత రాహుల్ గాంధీ, ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్, తెలంగాణ నుంచి సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు మహేష్.కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, వాకిటి శ్రీహరి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ తదితరులు హాజరయ్యారు. గత కొంతకాలంగా హైకమాండ్ కు నేతలకు మధ్య ఏదో ఉందన్న ప్రచారాలన్నీ ఈ మీటింగ్ లతో తుడిచిపెట్టుకుపోయాయి. తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ గత ఏడాదిన్నరలో ఎంతో సాధించాయని నేతలు ప్రశంసించారు.

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999

# ప్రశ్నించే గొంతుగా యువత..!

## స్థానిక ఎన్నికలపై యువత దృష్టి..

## పోటీ చేసేందుకు పలువురి ఆసక్తి

పార్టీలలో సీనియర్లకు పెద్దపెట వేస్తారా ..? లేక యువతకు ప్రాధాన్యత కల్పిస్తారా..?

అవకాశం ఇవ్వని యెడల యువకులు రెబల్ గా పోటీ




**ఆమనగల్లు, మహా:** స్థానిక సంస్థల, మున్సిపల్ ఎన్నికల పై గ్రామ యువత ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే గ్రామాల్లో సమస్యలపై ప్రశ్నించే గొంతుకలుగా మారుతున్నారు. బరిలోకి దిగేందుకు యువత ఆసక్తి చూపుతున్నది. పోటీ కోసం యువ నాయకత్వం రంగం సిద్ధం చేసుకుంటున్నది. ఒకవైపు, ప్రజల్లో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి యువ నాయకులు చొరవ చూపుతున్నారు. మరోవైపు, గ్రామంలోని ముఖ్య నాయకులను కలుస్తూ వారి ఆశీస్సులు పొందేందుకు యత్నిస్తున్నారు.అన్ని రాజకీయ పార్టీల్లోని యువకులు రాజకీయ నాయకులుగా.. ప్రజా ప్రతినిధులుగా మారాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది... యువకులు పరిషత్ ఎన్నికలైన ఎంపీటీసీ, జడ్.పీ.టీ.సీలకే కాకుండా మున్సిపల్ ఎన్నిక బరిలో,పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసేందుకు యువత పోటీ చేసేందుకు సమాయత్తమవుతున్నారు. ఈ సారి జరగబోయే.. పరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీ. ఆర్.ఎస్, బీజేపీ ప్రధాన రాజకీయ పార్టీల్లో యువత కు ఏ పార్టీ అవకాశం ఎక్కువగా కల్పిస్తుంది.. అనేది ఆసక్తిగా మారింది.కొంత మంది యువకులు తమకు అవకాశం ఇవ్వని యెడల రెబల్ అభ్యర్థులుగా బరిలో ఉండే అవకాశలు ఉన్నాయి... రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థ ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తుండడంతో గ్రామాల్లో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల బరిలో యువత నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వము స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించుటకు ఇప్పటికే ఆర్డినెన్స్ తెచ్చి గవర్నర్ అనుమతి కోసం ఎదురుచూస్తుంది. అటు సెప్టెంబర్ 30 లోపు స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి చేయాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలను జారీ చేయడంతో ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు సిద్ధమైంది. ఏ క్షణమైనా స్థానిక సంస్థల నోటిఫికేషన్ రానుండడంతో గ్రామాలలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వస్తాయా అని ప్రణాళిక రచిస్తున్నారు.నోటిఫికేషన్ వెలువడినంకా.. తాము నమ్ముకున్న పార్టీల నుండి ఆశించిన విధంగా తమకు గుర్తింపు లభిస్తుందా.. లేదా అన్నది ప్రశ్నర్థకంగా మారింది. సీనియర్ రాజకీయ నాయకులు ఎక్కువ సంఖ్యలో ఉండటం, అందులో మాజీ ప్రజా ప్రతినిధులు కూడ అధికంగా ఉండటం.. యువకులకు సీనియర్ నేతల నుండి పోటీ ఉండడంతో..వారి ఆశలకు ప్రతిభంధకంగా మారే అవకాశాలు లేక పోలేదు. వివిధ రాజకీయ పార్టీల పెద్దలు స్థానిక సంస్థల ఎన్నికల్లో సీనియర్లకు పెద్దపెట వేస్తారా ..? లేక యువతకు ప్రాధాన్యత కల్పిస్తారా..? అన్నది తేలాలంటే స్థానిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై.. పోటీలో ఉండే అభ్యర్థుల జాబితా వెలువడితే కానీ తెలియని పరిస్థితి నెలకుంది.ఈసారి జరగనున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో ఎక్కువ శాతం యువకులు బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. రిజర్వేషన్ అనుకూలిస్తే జడ్పిటిసిగా పోటీ చేసేందుకు ఆకుతోటపల్లి గ్రామ యువకులు న్యాలపట్ల నరేందర్ రెడ్డి సిద్ధంగా ఉన్నారు. అదేవిధంగా శెట్టిపల్లి గ్రామానికి చెందిన ఎగిరిశెట్టి సత్యం, సైతం జడ్పిటిసి బరిలో ఉండనున్నారు.

**ఎన్నికలు ఆర్థిక భారమే :**

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారికి ఈసారి ఎన్నికలు ఆర్థిక భారమేనని చెప్పవచ్చు. ఈ ఎన్నికల్లో ఆశావాహులు ఎక్కువమంది బరిలో నిలిచే అవకాశం ఉండడంతో ఎన్నికల నిర్వహణ ఖర్చు కూడా పెరిగే అవకాశం ఉంటుంది. గ్రామస్థాయిని బట్టి సర్పంచ్ అభ్యర్థికి పది లక్షల నుంచి 30 లక్షల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి కనిపిస్తున్నాయి.

**యువత ఉత్సాహం ..**

రాజకీయాలంటే పెద్దగా ఆసక్తి చూపని యువత ధోరణిలో ప్రస్తుతం మార్పు కనిపిస్తున్నది. రాజకీయాల్లోకి రావడానికి మక్కువ చూపుతున్నది. అందుకు ఎన్నికలను అవకాశంగా మలుచుకోవాలని ఎంతో మంది యువకులు భావిస్తున్నారు. అటు రాజకీయ హోదాను అనుభవించేందుకు, అదే సమయంలో ఇటు ప్రజా సేవ చేయొచ్చన్న ఆలోచనతో చాలా మంది యువ నేతలు ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు..

## పాడి రైతుల సమస్యలు పరిష్కరించండి



**ఆమనగల్లు, మహా:** పాడి రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రైతుల సమస్యలు పరిష్కరించే దిశగా విజయ డెయిరీ చొరవచూపాలని కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు.గురువారం కడ్తాల్ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమాఅభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్, రంగారెడ్డి జిల్లా వారి ఆధ్వర్యంలో నాణ్యమైన పాల సేకరణపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తిదారుల బిల్లులు సకాలంలో చెల్లించాలని, ప్రభుత్వం అందించే బోనస్ ను పాల బిల్లులతోపాటే జమ చేయాలని కోరారు. రైతులకు సబ్సిడీపై గడ్డి విత్తనాలు, పశుగ్రాసం మరియు దాణా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ మోహన్ మురళీ మరియు మేనేజర్ ప్రాణేష్ కుమార్ లను కోరారు.పాడి పశువుల పెంపకంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. సకాలంలో పాల బిల్లులు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల అయ్యే విధంగా ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. పాడి రైతుల యొక్క సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, రైతు కోఆర్డినేటర్ జోగు వీరయ్య, మంగళపల్లి నరసింహ, గంప శ్రీనివాస్, గూదే రాములు,వెంకట్ రాములు గౌడ్, మహేష్, రంగయ్య , జంగయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## హరిహర వీరమల్లు సినిమా విడుదలపై భారీగా సంబరాలు



**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు పట్టణంలో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి జనసేన పార్టీ అధినేత టాలీవుడ్ పవర్ స్టార్ కొణిదెల పవన్ కళ్యాణ్ నటించిన నూతన చిత్రం హరిహర వీరమల్లు గురువారం ఆమనగల్ పట్టణంలో శ్రీ వెంకటేశ్వర థియేటర్ లో విడుదలైన సందర్భంగా ఆమనగల్లు మెగా పవర్ స్టార్ అభిమానుల ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, బాణసంచా కాల్చి కేక్ కట్ చేసి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు.. మెగాస్టార్ చిరంజీవి, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కు అనుకూలంగా నినాదాలు చేస్తూ సినిమా విజయవంతం పై హర్షం వ్యక్తపరిచారు... ఈ కార్యక్రమంలో మెగా పవర్ స్టార్ అభిమానులు బికుమాండ్ల నరసింహ, జెనిగల గిరి యాదవ్, నీరటి నరసింహ,వడ్డెమోని శివకుమార్,రఫీ,నాజర్, సంతు, సత్యం, సాయి, గణేష్ తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ యువతకు ఐకాన్ కేటీఆర్ :గోలి శ్రీనివాస్ రెడ్డి



**ఆమనగల్లు, మహా:** బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వహణ అధ్యక్షునిగా, ఐటీ, పురపాలక, పరిశ్రమల మాజీ మంత్రి తెలంగాణ యువతకు ఐకన్గా, పార్టీ నేతలకు మార్గదర్శకులుగా ఉన్న కల్వకుంట్ల తారక రామారావు తెలంగాణ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి కోనియాడారు.మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకోని గురువారం ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల ఆయా మండలాల గ్రామాలలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమనగల్లు, కడ్తాల్ పట్టణంలో ఏర్పాటు చేసిన కేక్ ను ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి,రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పలవెంకటేష్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు.ఆయా కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ గంప వెంకటేష్, సిఎల్ శ్రీనివాస్,లక్ష్మి నర్సింహా రెడ్డి,నిరంజన్ గౌడ్, వెంకటయ్య,శ్రీనివాస్ రెడ్డి,సయ్యద్ ఖలీల్,రహమాన్,కదారి రామకృష్ణ,గుత్తి బాలస్వామి, రాములు, వెంకటేష్, సాయిలు శివ కుమార్, సతీష్, గణేష్, జగన్, శివ, అబ్బు, అఫ్రోజ్, హేమ్లు నాయక్, మాజీ ప్రజాప్రతినిధులు చంద్రమౌళి, గోపాల్, రవీందర్ రెడ్డి, సాయిలు, శ్రీశైలం, పాండు నాయక్, వెంకటేష్, గంప శ్రీనివాస్, సురేష్, మంగళ్ళలి నరసింహ, వరుణ్, రామచంద్రయ్య, పవన్, మల్లేష్, కృష్ణయ్య, పాండు, అమృతం, సురేష్, వంశి యాదవ్, గణేష్, మహేష్, ఒగ్గు మహేష్, అంజయ్య, పోతుగళ్ల మహేష్, సాయి, వెంకటేష్, సిద్దిగారి సురేష్, చేన్నయ్య, కృష్ణ తదితరు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలి

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
- అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహణ
- అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇవ్వాలి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందాలని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో జిల్లా, మండల, మున్సిపాలిటీ అధికారులతో, ఆర్డిఓ అనంతరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డులు నేటి నుంచి అందించాలని అన్నారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులను, ఇందిరమ్మ ఇండ్లు అందించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇండ్లు, 500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా వంటి పథకాలను అర్హులైన పేద ప్రజలకు అందించాలని ఆయన అధికారులను కోరారు. మున్సిపాలిటీలలో, గ్రామాలలో అర్హులైన ప్రతి ఒక్కరికి, సంక్షేమ పథకాలు చేకూరే విధంగా, దండోరా వేయించి, గ్రామ కార్యదర్శులు, మండల, మున్సిపాలిటీ అధికారులు పర్యవేక్షించాలని, అర్హులై ఉండి పథకాలు అందని వాళ్లకు అర్థమయ్యే విధంగా వివరించి, ఈ యొక్క పథకాలను అందించాలని, ముఖ్యంగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల విషయంలో జాగ్రత్తలు వహించి, అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే అందించాలని ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గంలో నాలుగు వేలకు పైగా ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేయడం జరిగిందని, ఇప్పటికే వందల కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, భవిష్యత్తులో ప్రజలకు లబ్ధి చేకూరే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి డిపిఓ సురేష్ మోహన్, ఎలక్ట్రిసిటీ డిఈ నరేష్, డిఎస్ఓ వనజాత, నాలుగు మండలాల ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు సునీత రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు అమరేందర్ రెడ్డి, బాలకృష్ణ, సత్యనారాయణరెడ్డి, పలు శాఖల అధికారులు కార్యదర్శులు పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

### కేటీఆర్ జన్మదిన సందర్భంగా తల సేమియా బాధితులకు

## రూ.3 లక్షల చెక్కు అందజేత

### ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని అభినందించిన కేటీఆర్




**షాద్ నగర్, మహా:** ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని ఈ విషయంలో పాలమూరు ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి నిరూపించారని, తల సేమియాతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తుల సహాయార్థం తన జన్మదినాన్ని పురస్కరించుకొని మూడు లక్షల రూపాయలు చెక్కు తన చేతుల ద్వారా అందజేయడం ఎంతో సంతోషంగా ఉందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. బిఆర్ఎస్ అధినేత కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ లో జరిగిన జన్మదిన వేడుకలకు మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా హాజరయ్యారు. కేటీఆర్ చేతుల మీదుగా 3లక్షల చెక్కును ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తల సేమియా వ్యాధిగ్రస్తులకు చెక్కును అందజేశారు. మహబూబాబాద్ మాజీ ఎంపీ మాలోతు కవిత తదితరులు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వెంట ఉన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని అభినందిస్తు ఇలాంటి సామాజిక సేవ కార్యక్రమాలు ఎంతో సంతృప్తిని ఇస్తాయని ఆయన పేర్కొన్నారు. తల సేమియా వ్యాధిగ్రస్తులను సామాజికంగా ప్రతి ఒక్కరు ఏదో ఒక విధంగా ఆదుకోవాల్సిన అవసరం ఉందని కేటీఆర్ సూచించారు. తన జన్మదినం సందర్భంగా పెద్ద ఎత్తున సామాజిక సేవ కార్యక్రమాలు ఆర్థికంగా ఇతర రూపకంగా చేపట్టిన అభిమానులకు పార్టీ ప్రజాప్రతినిధులకు అందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన సందర్భంగా తల సేమియా వ్యాధితో బాధపడుతున్న వ్యాధి గ్రస్తులకు వైద్య సహాయర్థం ఉమ్మడి పాలమూరు జిల్లా తరఫున 3 లక్షల ఆర్థిక సాయాన్ని చెక్కు ద్వారా కేటీఆర్ చేతుల మీదుగా అందజేయడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని ఆయన తెలిపారు. ఇలాంటి పుట్టినరోజులు కేటీఆర్ ఎన్నో జరుపుకోవాలని రాష్ట్రానికి మార్గదర్శక నిలవాలని తెలంగాణ అభివృద్ధి విషయంలో ఒక దిక్సూచిగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. రాబోయేది తెలంగాణలో బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ కవిత నవీన్ కుమార్ రెడ్డిని అభినందించారు.

### కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా బుక్స్ పంపిణీ చేసిన

## ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ నేతలు



**బాలాపూర్ మహా:** ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశాలకు మేరకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజు సందర్భం గా మహేశ్వరం నియోజకవర్గం,రామకృష్ణ పురం డివిజన్ లో ఉన్న మండల పరిషత్ ప్రైమరీ ఉర్దూ స్కూల్ లో మహేశ్వరం నియోజకవర్గం జనరల్ సెక్రెటరీ మురుకుట్ల అరవింద్ శర్మ,డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ ఆధ్వర్యం లో నోట్ బుక్స్,పెన్నులు,పెన్సిల్ పంపిణీ చేశారు. గత ప్రభుత్వం లో ఐటీ శాఖ మంత్రి గా అంతర్జాతీయం గా అనేక కంపెనీ తెలంగాణ కు తీసుకొచ్చి ప్రత్యక్షం గా,పరోక్షం గా వేలాది మంది నిరుద్యోగు లకు ఉపాధి ,ఉద్యోగ అవకాశాలు కల్పించారని బీఆర్ఎస్ నేతలు కొనియాడారు. విజనరీ ఉన్న నేతగా,తండ్రికి తగ్గ తనయుడిగా కేటీఆర్ తెలంగాణ ప్రజల గుండెల లో నిలిచిపోయారనీ అరవింద్ శర్మ తెలిపారు. హైదరాబాద్ ను విశ్వ నగరం గా మార్చే క్రమం లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. కేటీఆర్ లాంటి విజనరీ ఉన్న నేత తెలంగాణ ప్రజలకు దొరకడం అదృష్టంగా భావిస్తున్నామని డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ తెలిపారు. భవిష్యత్తు లో ఉన్నతమైన పదవులు అధిరోహించాలని బీఆర్ఎస్ నేతలు ఆకాంక్షించారు, ప్రజా సమస్యల పై నిత్యం పోరాడే శక్తి ని ప్రసాదించాలని కోరుకున్నట్టు వారు తెలిపారు. ఆయురారోగ్యాల తో ప్రజలకు మరింత సేవ చేసే భాగ్యం ఇవ్వాలని కోరుకున్నట్టు నగేష్ తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం,రామ కృష్ణాపురం డివిజన్ తరపున కేటీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్టు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో గొడుగు శ్రీనివాస్,సాజిద్,సిద్ధ గొని వెంకటేష్ గౌడ్,నేలకొండ శ్రీనివాస్ రెడ్డి,కొండ్రు శ్రీనివాస్,రామాచారి,పెంబర్తి శ్రీనివాస్,కంచర్ల శేఖర్,ముచ్చింతల జగన్,వాజిద్ పటేల్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కెజివిపి వసతి గృహన్ని తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్ఓ



**ఆమనగల్లు, మహా:** రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి ,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు ఆదేశానుసారం ఆమనగల్లు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కస్తూరిబా గాంధీ వసతి గృహంలో కందుకూర్ డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ గీత,ఆమనగల్లు ప్రభుత్వ వైద్యాధికారి మంజులాదేవి తో కలిసి గురువారం సాయంత్రం ఆమనగల్లు లోని కేజీవీపీ బాలికల వసతి గృహాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేజీవీపీ హాస్ట ళ్లలో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని డిప్యూటీ డిఎంహెచ్ డాక్టర్ గీత విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో బియ్యం, కూరగాయలు, ఇతర సరుకులు నిల్వ ఉంచిన గదిని, డైనింగ్ హాల్ను పరిశీలించారు. విద్యార్థుల కోసం వండిన కూరలను రుచి చూశారు. నాణ్యతగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. స్టోరేజ్, విద్యార్థుల గదులు, మరుగుదొ డ్లను శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా మండల కేంద్రంలోని బాలికల వసతి గృహంలో టెన్త్ విద్యార్థులతో మాట్లాడారు.వారితో పాటు వైద్యాధికారి మంజులాదేవి, డాక్టర్ మహ్మూనా బేగం,ఎచ్ఈఓ తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

## మంచిరేవుల కొండలపై చిరుత కలకలం...!

- ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ ప్రజలు
- ప్రజల ప్రభుత్వంగా ఉండాలి అధికారులు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మంచిరేవుల ఇఐపిఎల్ రివరేజ్ విల్లాస్ పరిసర ప్రాంతాల్లో చిరుత సంచారం కలకలం రేపింది. విల్లా యజమాని తన ఇంటి పైనుంచి, కొండపై కూర్చున్న చిరుత పులిని తన సెల్ఫోన్ కెమెరాలు బంధించాడు. రంగారెడ్డి జిల్లా, నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలోని, మంచిరేవుల ఇఐపిఎల్ రివరేజ్ విల్లాస్ పక్కన ఉన్న కొండపై చిరుత కనబడడంతో ఆ ప్రాంత ప్రజలంతా ఒక్కసారిగా ఉలిక్కిపడి, భయాందోళనలకు గురయ్యారు. మంచిరేవుల చుట్టుపక్కల చిరుత సంచరిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళలలో ఆరు బయట తిరుగవద్దని, ఒంటరిగా బయటకు వెళ్లకూడదని, అధికారులు ప్రజలకు సూచించారు.

# కాంగ్రెస్ బీసీలను మోసం చేస్తుంది..?

### బీజేపీ జిల్లా అధ్యక్షులు

## రాజ్ భూపాల్ గౌడ్

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా
- మతపరమైన రాజకీయాలు చేయొద్దు
- 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** స్థానిక సంస్థల ఎన్నికలలో జిల్లాలో బిజెపి జెండా ఎగరడం ఖాయమని జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. మహేశ్వరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ భూపాల్ గౌడ్ మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికలలో రంగారెడ్డి జిల్లాలో బీజేపీ జెండా ఎగరేయడం ఖాయమని, మతం ప్రాతిపదికన ఏర్పాటు చేసిన రిజర్వేషన్లుకు బీజేపీ వ్యతిరేకమన్నారు. మైనారిటీ ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ దోబూచులాడుతుందని అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు, బీజేపీ పార్టీ వ్యతిరేకం కాదన్నారు. బిసి రిజర్వేషన్ల అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన మోసం చేస్తుందని అన్నారు. బీసీ వ్యక్తిని ప్రధానమంత్రిని చేసిన ఘనత బిజెపి పార్టీది అన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ను వెంటనే అమలు చేయాలన్నారు. సెప్టెంబర్ 30 వరకు హైకోర్ట్ ఇచ్చిన తీర్పు ప్రకారమే స్థానిక ఎన్నికలు పూర్తి చేయాలన్నారు. మతతత్వ రాజకీయాలు చేయొద్దని, కాని కాంగ్రెస్, బిఆర్ఎస్ మైనార్టీలను ఓట్ల కోసం పాకులాడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

**స్థానిక సంస్థలో కచ్చితంగా బిజెపి...**

స్థానిక సంస్థల ఎన్నికలలో 21 జడ్పీటీసీ స్థానాలు,10 ఎంపీపీలను కచ్చితంగా బీజేపీ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తానన్నది కేవలం మాటలకే పరిమితమైందన్నారు. హైకోర్టు ప్రశ్నించే వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల గురించి ఆలోచన చేయలేదని ఆయన దుయ్యబట్టారు. సెప్టెంబర్ 30లోగా ఎన్నికల నిర్వహించాలని ప్రభుత్వానికి కోర్టు మొట్టికాయలు వేసిందన్నారు. ఇప్పటికైనా ఎన్నికలు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు బీసీలపై డిక్లరేషన్ ఇవ్వలేదని మండిపడ్డారు. బీసీ లపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే బీసీ డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పిటిసి స్థానాలలో మెజార్టీగా బిజెపి గెలుస్తుందని, కచ్చితంగా జిల్లాలో బిజెపి పాగా వేస్తుందని రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాజ భూపాల్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎన్నికల ఇంచార్జి అందేల శ్రీరాములు యాదవ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ రెడ్డి,నాయకులు పాపయ్య గౌడ్, కదారీ జంగయ్య యాదవ్,మిద్దె సుదర్శన్ రెడ్డి,యాదయ్య గౌడ్, పోతర్ల సుదర్శన్ యాదవ్, కుండే వెంకటేష్, మోహన్ నాయక్, అనంతయ్య గౌడ్, మహేశ్వరం మండలం బిజెపి అధ్యక్షుడు యాదిష్ పలువురు బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా రంగానికి ప్రభుత్వం పెద్దపీట

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఆమనగల్లు, మహా:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంవిద్యా రంగానికి పెద్దపీటవేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారంకడ్తాల్ మండల పరిధిలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల మైసిగండి లో ప్రభుత్వం మంజూరు చేసిన మంచినీరు కోసం 6 లక్షలతో ఆర్ఓ వాటర్ ఫిల్టర్ ను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రారంభించారు. విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయబడిన నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, నైట్ డ్రెస్, స్పోర్ట్స్ డ్రెస్, ట్రంక్ బాక్స్,లను ఎమ్మెల్యే పంపిణి చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చదువుని ఇష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నతంగా ఉంటారని, ప్రభుత్వం కల్పించిన వసతులను వినియోగించుకొని మంచి ఫలితాలను సాధించి తల్లిదండ్రులకు, పుట్టిన ఊరుకు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు, చదివిన పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు . ఈ సందర్భంగా విద్యార్థులను పలు సూచనలు సలహాలు అందించి విద్యార్థుల్లో స్పూర్తిని నింపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల కోసం కాస్మోటిక్ చార్జలు 200 శాతం మెస్ చార్జీలు 40 శాతం పెంచి విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందేవిధంగా చర్యలు తీసుకున్నారన్నారు.అదేవిదంగా పాఠశాల వసతి గృహంలో ఆవరణలో రెండు కోట్ల డెబ్బై లక్షల నిధులతో నిర్మాణంలో ఉన్న అదనపు గదులు, డైనింగ్ హాల్ పనులు పరిశీలించి, నిర్మాణ పనులలో నాణ్యతను పాటించాలని కాంట్రాక్టర్లకు సూచనలు ఇచ్చారు.అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. టీపీసీసీ సభ్యులు 1 అయిల్ల శ్రీనివాస్ గౌడ్ విద్యార్థుల అభ్యర్థన మేరకు మైక్ సెట్, క్రీడా సామాగ్రిని అందజేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రెటరీ భీక్య నాయక్, మండల పార్టీ అధ్యక్షులు బిచ్యాబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా, నాయక్,మాజీ సర్పంచ్ మాదారం శేఖర్ గౌడ్,చేగురి వెంకటేష్, జవహర్ లాల్ నాయక్, నరేష్ నాయక్, హీరా సింగ్, కాసు శ్రీనివాస్ రెడ్డి రామకృష్ణ,యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బోసు రవి, శవినోద్ కుమార్ తులసి రామ్ నాయక్, సుమన్, మధు, నర్సింహా, మల్లేష్, ఇతర ప్రజాప్రతినిధులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే పాపయ్య వసతి గృహ సంక్షేమ అధికారి వి బాలరాజు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు స్థానికులు పాల్గొన్నారు..

